# కులాసా

- స్వామి చిత్రానంద

"అంతా కులాసాయేనా?" అని అడిగింది వర్ధనమ్మగారు వంట గది లోంచి తొంగిచూస్తూ-

"ఆ...అంతా కులాసాయే-" అన్నారు సచ్చిదానందంగారు. అప్పుడే వచ్చిన ఉత్తరం చదువుతూ "ఎక్కణ్ణించీ?" అంది వర్ధనమ్మగారు.

"రాజమండ్రి నించి మీ కామేశ్వరరావుగారు రాశారు. రా! ఇలా వచ్చి విను."

వర్ధనమ్మగారు వచ్చి, సోఫాలో భర్త పక్కనే కూచుంది.

"మరీ నన్ను తగుల్తూ కూచున్నావు. ఎవరేనా అడిగితే 'మడి-మడి' అంటావ్?"

"మీరూ మడే-మిమ్మల్ని తగిల్తే ఏం కాదు...ఊ...చదవండి"

"బ్రహ్మశ్రీ వేదమూర్తులైన శ్రీ సచ్చిదానందం గారి-" అని చదువుతున్నారు...

"వేదమూర్తులా? మీరా?" అని దెప్పిపొడిచింది.

"ఏమో-వెళ్ళి ఆయన్నే అడుగు-"

"నేను అడుగుతాగాని మీరు చదవండి-"

"శ్రీ సచ్చిదానందంగారి పాదపద్మములకు నమస్కరించి-"

"అవన్నీ ఎందుకండీ? అసలు సంగతి చదవండి. నా కవతల వంటింట్లో పనుంది."

సచ్చిదానందంగారు నాలుగైదు పంక్తులు పైకి చదవకుండా, దృష్టి మాత్రం కిందకు పారించి-

"ఆ...వచ్చే నెల 16వ తేదీన మా పెద్దమ్మాయి చి.సౌ॥ జానకి సీమంతమున్నూ-ఆ రాత్రే మా ఆఖరి అమ్మాయి చి.సౌ. రమణ పెళ్ళి-మర్నాడు అనగా 17 తా.న నా షష్ఠిపూర్తి జరిపించుటకు పెద్దలు నిర్ణయించినారు. వీటన్నిటికీన్నీ-మీరూ మా వర్ధనమ్మ అక్కయ్య తప్పకుండా వచ్చి అన్ని శుభకార్యాలూ దగ్గరుండి జరిపించి-మమ్మల్ని ఆశీర్వదించ ప్రార్థన.

శుభలేఖలు అచ్చు అవుతున్నాయి. అవి రాగానే పంపుతాను. ముందుగా మీకు తెలియజెప్తే, రైల్వే రిజర్వేషన్‌కు వీలుగా వుంటుందని రాస్తున్నాను. మీ తిరుగు ప్రయాణానిక్కూడా మీరు ఎప్పటికి కొనమంటే అప్పటికి కొంటాను. వివరంగా ఉత్తరం రాయండి. మీ ప్రేమ పాత్రుడు కామేశ్వరరావు వ్రాలు-"

అని ఉత్తరం మడతబెడుతూ-

"మహబాగా పెట్టాడయ్యా ప్రోగ్రాములన్నీ-అటు శుభకార్యాలు చేసే వాళ్ళకీ-ఇటు చూసే వాళ్ళకీ కూడా ఇబ్బంది లేకుండా!" అన్నారు సచ్చిదానందంగారు.

"ఆ...చాల్లెండి. నాలుగు శుభకార్యాలూ వరసగా చేసేసరికి ఒళ్ళు హూనమైపోతుంది. తెలుసా?... ఏమైనా, మనం నాలుగు రోజులు ముందే వెళ్దాం. వాళ్ళకీ కాస్త సాయంగా వుంటాం. మళ్ళీ మనకి 18 తారీఖు గౌతమికి, అక్కణ్ణించి కొనమని ఇవాళే రాసెయ్యండి. మళ్ళీ ఆలిస్యం అయితే కింద బెర్తులు దొరకవు" అంటూ లేచింది. గోడనున్న కాలెండరు చూసి-



"మనం 12 తారీఖున బయల్దేరి వెళదాం-సప్తమ శుక్రవారం బావుంది. ఇవాళే వెళ్ళి టిక్కెట్లు తీసుకురండి. వాళ్ళక్కూడా ఇప్పుడే ఉత్తరం రాయండి."

"అలాగే-ఆ అలమారాలో నా ఉత్తరాల సంచీ, పెన్నూ వుంటాయి. తీసుకురా. ఇప్పుడే

5-4-96 ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక

రాసేస్తాను.'

"ఆ మాయదారి తోలుసంచీ నేను ముట్టుకోను. నాకు మడి" అని వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఆమె ఆజ్ఞప్రకారం సచ్చిదానందంగారు టిక్కెట్లు రిజర్వ్ చేసుకు వచ్చారు.

ఆ రాత్రి—

పడక గదిలో భర్తతో వర్ధనమ్మగారు—

"ఏమండీ! రాజమండ్రి శుభకార్యాలకి మా సీతని తీసుకుని మా పరంధామయ్యబావ కూడా వస్తాడు. మా శ్రీలక్ష్మి సరేసరి—దానికే ఉత్తరం రాసాను. ఎలాగైనా రాంపండును తీసుకు రమ్మని—"

"నువ్వు రాయడం ఎందుకూ? వాళ్ళెలాగూ వస్తారు."

"అది కాదండి. మా పరంధామయ్య బావ మరీ పట్టుదలకి పోయి, కూతుర్ని కాపరానికి పంపడం లేదు. ఆ రాంపండు ఉద్యోగం అంటూ పట్నంలో కాపరం—తల్లిగారు ఆ పల్లెటూరు వదిలిపోనంటుంది. వేరే గతిలేక వాడు పట్నంలో హోటల్ తిండి తినలేక వాడే చెయ్యి కాల్చుకుంటున్నాడు" అంది వర్ధనమ్మగారు.

"కానీ కట్నం పుచ్చుకోకుండా ఆమెగారు పెళ్ళికి ఒప్పుకుంది—అవిడ భూమిని ఆయనకి అమ్మకుండా వేరే వాళ్ళకి మంచి బేరం వచ్చిందని అమ్మితే—ఈయనకి ఇంత పగా? కూతురు బతుకు పాడుచేస్తాడా? ఆయనా ఓ మనిషేనా?" అన్నారు సచ్చిదానందంగారు.

"నేనోమాట చెబుతా వినండి. మీరు ఆ రాంపండుని ఎక్కెయ్యండి. నేను ఆ సీతని ఎక్కేస్తాను. ఈ శుభకార్యాలు ముగిసేలోపల వాళ్ళిద్దరినీ కలపాలండి."

"సరేలే—పడుకో—"

"అలా అంటే కాదు—నాకు మాట ఇవ్వాలి."

"నేను నీకు మాట ఇవ్వడం ఏమిటి? నువ్వే నాకు మాట ఇస్తావు. ఆ మాట నాకు ఆజ్ఞ."

ఇద్దరూ ఏకాభిప్రాయానికి వచ్చి పడుకున్నారు.

అనుకున్న ప్రకారం వర్ధనమ్మగారు భర్తను తీసుకుని 12 తే.న బయల్దేరి 13 తే.న రాజమండ్రి చేరారు.


ఈ దంపతుల్ని చూడగానే కామేశ్వరరావుగారి కుటుంబం సంబరపడి పోయారు.

"రండి రండి" అంటూ కామేశ్వరరావుగారి భార్య సకల మర్యాదలూ చేసింది.

"ఏదీ పెళ్ళికూతురు? ఏదీ సీమంతం పెళ్ళికూతురు? అన్నట్టు—ఏదీ మా షష్టిపూర్తి పెళ్ళికొడుకు?" అంటూ అందరినీ ఆప్యాయంగా పలకరించి—

"ఒదినా! అయిందానికి కానిదానికి నువ్వు హైరానా పడకు. నాకూ పనిచెప్పు. నీకు

### వృక్ష విలాపం



దగాకోరు మనుషులు!
నీలోను, నాలోను ఉన్నది ఒక్కటేనని తెలిసినా
నిన్ను కొలుస్తారు, నన్ను కాలుస్తారు
— ఎం.ఎస్.నారాయణ

సాయంగా వుండాలనే ముందుగా వచ్చాను" అంది వర్ధనమ్మగారు.

"ఒద్దులెండి వదినా. మీ అన్నగారు అన్నీ కాంట్రాక్టులు ఇచ్చేశారు. మనమేం చేసుకోక్కర్లేదు" అంది కామేశ్వరరావుగారి భార్య.

"అవున్లే—అదీ నిజమే. ఏవో అనుకుంటాం గాని—ఏ పనీ చెయ్యలేం. ఒళ్ళు హూనమైపోదంతప్ప" అంది వర్ధనమ్మగారు.

ఆ మూడు రోజుల్లోనూ వర్ధనమ్మ దంపతులు గోదావరి స్నానాలు చేశారు. ద్రాక్షారామ పట్టిసీమ వగైరా క్షేత్రాలను చూసి వచ్చారు.

15 తా. ఉదయం పరంధామయ్యగారు తన కూతురు సీతను తీసుకు వచ్చారు. మధ్యాహ్నం శ్రీలక్ష్మి, కొడుకు రాంపండూ వచ్చారు. రెండు కుటుంబాలూ ఎడమొహం పెడమొహం. అయినా కామేశ్వరరావుగారికి చాలా దగ్గర బంధువులవడం మూలాన వాళ్ళింట్లో జరగబోయే ఆఖరి శుభకార్యం కనక వారు రాక తప్పలేదు.

వర్ధనమ్మ, సచ్చిదానందంగార్ల అగ్రిమెంటు ప్రకారం వారి వారి అభ్యర్థుల్ని పలకరించదు. వారిని తమ పక్షానికి తిప్పుకోడానికి ప్రయత్నాలు సాగించారు.

భోజనాలైన తర్వాత రాంపండును అలా షికారు అని వంకపెట్టి సచ్చిదానందంగారు తీసుకు వెళ్ళారు. ఆయన మాటల్లో ఆలుమగల అన్యోన్యతనీ—ఒకరికొకరి అవశ్యకతనీ—వివరించారు. రాంపండుకు ఆయన చెప్పిన మాటలన్నీ నచ్చాయి. భార్య లేని ఒంటరి బతుకు అనుభవిస్తున్నాడు. అదెంత దుర్భరమో అతనికి తెలుసు. పరంధామయ్యగారు చెబుతూనే వున్నారు. అతను వింటూనే వున్నాడు.

"ఎందుకయ్యా! ఈ గొడవలు? మీ ఆవిడని పలకరించు—మాట్లాడు. భర్త పలకరించాడనే తృప్తిని ఆ పిల్లకి దక్కనీ" అన్నారు.

"దానికీ—వాళ్ళ నాన్న పెంకితనంలో సగం వుందండీ" అన్నాడు రాంపండు.

"సగం లేదుగా! దాన్ని 'కులాసా?' అని అడుగు. అంతే చాలు—ఆ మూడక్షరాలమాట ఆ పిల్లకి ఎంతో ఆనందం కలిగిస్తుంది."

రాంపండు తన దారికి వస్తున్నాడన్న తృప్తితో సచ్చిదానందంగారు ఇంటికి తిరిగి బయల్దేరారు.

అదే రాత్రి—

వర్ధనమ్మగారు సీతని ఒంటరిగా డాబామీద కూచోబెట్టి చెబుతోంది.

"అయినా, మీ నాన్నకి మరీ అంత పెంకితనం ఏవిటి? మీ అత్తయ్య తన భూమిని మీ నాన్నకి అమ్మలేదని, ఇలా పగబడతాడా? నిన్ను కాపరానికి పంపనంటాడా? ఏదో రేటు బాగా వచ్చిందని బైటవాళ్ళకి ఆ భూమిని అమ్ముకుంది. అది తప్పా? మీ నాన్నకి లేదా? పోదా?"

సీత శ్రద్ధగా వింటోంది. ఆమె ఏదీ కాదని చెప్పలేక పోతోంది. వర్ధనమ్మగారు చెబుతూనే వుంది.

"నువ్వేం పసిపిల్లవు కావు. నీ బతుకు నువ్వే సరిదిద్దుకోవాలి. ఆడపిల్ల బతుకు అరిటాకు అని అంటారు. కాని నేను ఒప్పుకోను. నేను మీ బాబయ్యతో ఎలా వేగుకు వస్తున్నాను? నేను కాకపోతే ఆయన ఒక్క క్షణం కూడా వుండలేరు తెలుసా? రాంపండును పలకరించు. చాలు. గంటలతరబడి గుసగుసలు ఒద్దు. 'ఏమండీ! ఆ ఏవండీ కూడా ఒద్దు—'కులాసా?' అను చాలు' అంది.

సీతక్కూడా ఈ ఆలోచన వచ్చింది.

ఆ మర్నాడు సాయంత్రం—

కామేశ్వరరావుగారి పెద్దమ్మాయి జానకి సీమంతం. ముత్తైదువలు అంతా ఆమెకు గాజులు తొడుగుతున్నారు. సీత గమనిస్తూనే వుంది. ఆడది ఒకరికి కూతురై, మరొకరికి భార్య అయి— వేరొకరికి తల్లి కాబోతోంది—ఆ శుభదినం త్వరలోనే రాబోతున్నది. స్త్రీ జీవితానికి ఒక పరిపూర్ణత సిద్ధించే సమయం. అంతా జానకిని ఆశీర్వదిస్తున్నారు, అభినందిస్తున్నారు.

ఇవన్నీ గమనిస్తున్న సీత మనసులో ఏవేవో ఊహలు–కోరికలు.

ఆ రాత్రి–

కామేశ్వరరావుగారి ఆఖరి అమ్మాయి రమణ పెళ్ళి–

తమ పెళ్ళి శోభనం జరిగి రెండు సంవత్సరాలైనా, రాంపండు, సీత మాత్రం ఈ పెళ్ళి కార్యక్రమం అంతా శ్రద్ధగా చూస్తున్నారు. వారి పెళ్ళిని ఓసారి గుర్తు తెచ్చుకుంటున్నారు. మాంగల్యధారణ, సప్తపది–తలంబ్రాలు–వగైరా అన్నీ గుర్తుకు వస్తున్నాయి. ఆనాడు 'నాతిచరామి' అని ప్రమాణం చేసినవీరు ఎందుకు వీడిపోయారు? ఎవరు విడదీశారు? మేం ఎందుకు కలవలేం? ఇవే వారి ఆలోచనలు.

ఆ మర్నాడు ఉదయం

కామేశ్వరరావు దంపతుల షష్టిపూర్తి–భర్తకు 60 సం.లు నిండాయి. ఆయన భార్యతో 40 సం.లు కాపరం చేశారు. వారి దాంపత్య జీవితానికి ఓ పరిపూర్ణత వచ్చింది. కొడుకులు, కోడళ్ళు– కూతుళ్ళు, అల్లుళ్ళు–మనవలు, మనవరాళ్ళు, అంతా హాయిగా వున్నారు. ఆ కుటుంబం చూడ ముచ్చటగా వుంది.

రాంపండు, సీతకూ కూడా అవే ఆలోచనలు. దాంపత్య జీవితంలోని మాధుర్యాన్ని ఊహించుకున్నారు.

మధ్యాహ్నం

భోజనాలు–సీత నెయ్యి వడ్డిస్తోంది. ఆమెను రాంపండు గమనించాడు. నెయ్యి వడ్డిస్తూ ఆమె రాంపండు దగ్గరకు వచ్చింది.

'కులాసా?' అని ప్రశ్నించింది.

అదే శృతిలో అదే సమయంలో రాంపండు కూడా

"కులాసా?" అన్నాడు. అదీ ప్రశ్నే. నువ్వెలా వున్నావు? అన్నట్టు వుంది ఆ ప్రశ్న. ఇది గమనించిన వర్ధనమ్మ సచ్చిదానందంగార్లకు పరమానందం. తమ పని పూర్తయిందన్న ఆనందం. వారిరువురికీ తొలిసారి తాము కలిసిన క్షణం గుర్తుకు వచ్చింది.

భోజనాలైనాయి.

బంధువులంతా డాబామీద వున్న షామియానా కింద జంబుఖానాలమీద కూచుని తాంబూలాలు సేవిస్తున్నారు.

అంతలోనే పైకి వస్తున్న పరంధామయ్యగారి గొంతు వినబడింది. అంతా వెంటనే విషయం మార్చేశారు.

పరంధామయ్యగారు మీసాలు దువ్వుకుంటూ పైకి వచ్చారు.

"రా బావా! నీ గురించే అనుకుంటున్నాం–" అన్నారొకాయన.

"నా గురించా?"

"అదే–నీ అమ్మాయి కాపరం గురించి. కోర్టులూ, దావాలూ ఎందుకు? రాజీపడితే పోలేదా అనుకున్నాం" అన్నారు సచ్చిదానందంగారు.

"చేయించు. నేనెప్పుడూ రాజీకి సిద్ధమే. నాకు మాత్రం వాళ్ళు కలవాలని, వాళ్ళ కాపరం నిలబడాలనీ వుండదా?" అన్నాడు పరంధామయ్య.

"అయితే–నువ్వా మాట మీద వుండు" అన్నాడు సచ్చిదానందంగారు.

"నేనేం మాట తప్పే మనిషిని కాదయ్యోయ్" అన్నాడు పరంధామయ్య.

అంతా పరంధామయ్య మాటకు ఆనందించారు.

ఆ రాత్రే–రమణ శోభనం.

శోభనం పెళ్ళి కూతుర్ని వర్ధనమ్మగారు ముస్తాబు చేస్తోంది. కావాలనే సీతను ఆమె పక్కన కూచోబెట్టుకుంది. రమణ ముస్తాబు అయింతర్వాత సీతను కూడా ఆమె ముస్తాబు చేసింది.

"సీతను కూడా పెళ్ళికూతురులా ముస్తాబు చేస్తున్నావు?" అన్నారు సచ్చిదానందంగారు.

"ఏదో సరదా. ఆ చేత్తోనే సీతకి తలదువ్వి పువ్వులు పెట్టాను. అంతే" అంది. వర్ధనమ్మగారు.

సమయం చూసి వర్ధనమ్మగారి నాయకత్వాన రమణను గదిలోకి పంపాలనుకున్నారు. ఆమె చేతికి పాల గ్లాసు యిచ్చి, తలలో పువ్వులు సర్ది ఆమెను గుమ్మం దాకా తీసుకు వచ్చింది వర్ధనమ్మగారు. గది తలుపు తోయమని రమణకు సైగచేసింది. రమణ సిగ్గుతోనే తోసింది. తలుపు తెరుచుకోలేదు.

"నాయనా! తలుపు తియ్యవయ్యా" అంది వర్ధనమ్మగారు.

"లోపలెవరున్నారు? పెళ్ళికొడుకు–ఇదిగో–ఇక్కడే వుంటేను" అనిఅనరు. సచ్చిదానందంగారు. శోభనం పెళ్ళికొడుకు సిగ్గు నటిస్తూ సచ్చిదానందంగారి వెనక్కు తప్పుకున్నాడు.

"అయితే లోపలెవరున్నారు?" అంది వర్ధనమ్మగారు ఆశ్చర్యంగా.

"అవును. సీత, రాంపండు ఎక్కడ? కనపడరేం?" అన్నారెవరో.

"వాళ్ళుగాని, లోపల వున్నారా?" సందేహించింది మరో ముత్తైదువ.

"అబ్బే! అదేం కాదు. నా కూతురు. నే గీసిన గీత దాటదు" అన్నారు పరంధామయ్యగారు.

"కాస్సేపాగండి. వాళ్ళే తీస్తారు" అన్నారొకరు.

"పెరటివైపునించి వెళ్ళి చూడండి" అన్నారు కామేశ్వరరావుగారు.

పెరటివైపు నించి లోపలకు వెళ్ళి హాలు వైపు తలుపు తెరిచారు ఓ బంధువు.

"లోపల ఎవరూ లేరు. రాంపండూ లేడు. సీతా లేదు" అన్నాడు.

వర్ధనమ్మగారూ సచ్చిదానందంగారు మొహమొహాలు చూసుకున్నారు. తమ కోరిక మేరకు ఆ ఇద్దరూ ఆ గదిలోనే కలిసి విడిపోయారని సంతోషించారు. కాని–అంతలోనే నిరాశ. పక్కమీద దుప్పటి నలగలేదు. తలగడలమీద కూడా పువ్వులు లేవు. ఓ తలగడమీద మాత్రం ఓ ఉత్తరం వుంది. అది పరంధామయ్యగారికి అని వుంది. పరంధామయ్యగారు తీసి చూశాడు–దాంట్లో.

"నాన్నా!

ఈ రెండు రోజుల్లోనూ ఇక్కడ జరిగిన శుభకార్యాల్లో–భార్యకి భర్త ఎంత అవసరమో నాకు బోధపడింది. భర్తలేని బతుకు వృధా అనిపించింది. నీ దురాశకు నా జీవితం బలికావడం ఇష్టంలేక బావతో వెళ్ళిపోతున్నాను. మన్నించగోరుతూ–నీ అమ్మాయి సీత" అని వుంది.

■

## గిన్నీస్ బుక్‌లోకి ఎక్కనున్న విజయనిర్మల



ప్రపంచంలో ఏ దర్శకురాలు చేయనన్ని సినిమాలకు దర్శకత్వం వహించిన శ్రీమతి విజయనిర్మల త్వరలో గిన్నీస్ బుక్‌లోకి ఎక్కనున్నారు. 'పుట్టింటి గౌరవం'తో 40 చిత్రాలకు దర్శకత్వం వహించిన మేడమ్ విజయనిర్మల నిజంగానే తెలుగుజాతి గర్వించదగ్గ వ్యక్తి. ప్రముఖ దర్శకుడు బాపు 'సాక్షి' సినిమా తీస్తుండగా, అందులో హీరోయిన్‌గా నటించిన తాము ఆనాడే 'దర్శకత్వం' చేపట్టాలని నిర్ణయించుకున్నట్టు విజయనిర్మల తెలిపారు. గిన్నీస్ బుక్‌లోకి ఎక్కనున్న 'మేడమ్'ను మనసారా అభినందిద్దాం.

– 'శ్రీను'